

సరస్వతీ మాత విగ్రహావిష్కరణలో పూర్వ విద్యార్థులు

నిధుల్లేక నిస్తేజం!

వికారాబాద్ మున్సిపాలిటీకి విడుదల కాని స్పెషల్ ఫండ్స్

- అభివృద్ధికి దూరంగా బల్దియా
- పన్నులు, ఆర్థిక సంఘం నిధులతోనే నెట్టుకొచ్చిన వైనం
- సకాలంలో జీతాలు అందక ఇబ్బందుల్లో కార్మికులు

వికారాబాద్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ మునిసిపాలిటీ దీనస్థితిలో కొట్టుమిట్టాడుతోంది. జిల్లా కేంద్రం.. బల్దియాలో కనీసం కార్మికులకు జీతాలు కూడా ఇవ్వని పరిస్థితి. చెక్కుల రూపంలో ట్రెజరీకి పంపిన జీతాలు ఎప్పుడు వస్తాయో కూడా తెలియదు. సాధారణ నిధుల నుంచి నేరుగా కార్మికులకు ప్రతీనెల అందించే అధికారులు.. ఈనెల మాత్రం ట్రెజరీకి చెక్కులు పంపించి చేతులు దులుపుకున్నారు. కాగా, 11 నుంచి సంక్రాంతి సెలవులు ఉండడంతో జీతాలు అందడం కష్టమే. దాంతో పండుగ పూట కార్మికులు

- మిగతా 8వ పేజీలో..



సరస్వతీ మాత విగ్రహం ఆవిష్కరణ

మొయినాబాద్: జనవరి 11, (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెంకటాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2000 - 01లో పదో తరగతి పూర్వవిద్యార్థులు పాఠశాలలో శనివారం సరస్వతీ మాత విగ్రహం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంధ్య, ఎంఈవో వెంకటయ్య, సంగారెడ్డి ఎంఈవో సత్తయ్య, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అధ్యాపకురాలు జోషి పద్మకు డాక్టరేట్



ఘటకేసర్ రూరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ, కొర్రెముల తిరుమలనగర్ కాలనీకి చెందిన జోషి పద్మ డాక్టరేట్ అందుకున్నారు. శ్రేయస్ ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న జోషి పద్మ ఏఐ డీప్ లెర్నింగ్, బ్లాక్‌చైన్ టెక్నాలజీని ఉపయోగించి సైబర్ సెక్యూరిటీలో 'వెబ్ అప్లికేషన్, కంప్యూటింగ్ మోడల్ అండ్ సెక్యూరిటీ' అంశంపై 8 ఇంటర్‌నేషన్ స్కోపస్ ఇండెక్స్ ఐఈఈఈ, స్ప్రింగర్ జర్నల్స్‌లో పరిశోధనలు సమర్పించారు. ఈమేరకు కూకట్‌పల్లిలోని జెఎన్టీయూహెచ్ నుంచి ఆమె డాక్టరేట్ అందుకున్నారు. గైడ్ రవిశంకర్ ఆధ్వర్యంలో ఆమె పరిశోధనలు చేసినట్లు శనివారం ఆమె 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. వర్సిటీ సీఎస్‌సీ హెచ్‌వోడీ డాక్టర్ సుప్రతి, కామాక్షిప్రసాద్, చైర్మన్ వినయ్‌కుమార్‌లు జోషి పద్మను అభినందించారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

- ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి
- ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో రూ.2.20 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపనలో మహేందర్‌రెడ్డి తదితరులు

ఘట్‌కేసర్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఈనెల 26 నుంచి ప్రభుత్వం రైతుభరోసా పథకం అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటోందని, గ్రామాలు, పట్టణాల్లో మౌలిక వసతులను కల్పించేందుకు ఎన్ని నిధులైనా కేటాయించేందుకు సిద్ధంగా ఉందని ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో రూ.2.20కోట్లతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో ముందుకు నడిపించడానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తున్నదన్నారు. ప్రధానంగా స్థానిక ప్రజాప్రతినిధులు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దేశంలో ఎక్కడా లేనటువంటి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తున్న ఘనత సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానిదేనన్నారు. ఇందులో ప్రధానమైనది ఆరు గ్యారెంటీల అమలు అని గుర్తుచేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని, నాయకులు మహేష్, బర్ల రాధాకృష్ణ, ముత్యాలు, బొక్క ప్రభాకర్‌రెడ్డి, మేడబోయిన వెంకటేష్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మించాలని వినతి

ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని 2, 3, 11వ వార్డుల్లో విస్తరించి ఉన్న బ్యూటీనెస్ట్ కాలనీలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తున్నదని, తక్షణమే డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని కాలనీవాసులు మహేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. మురుగు నీరు రోడ్లపై పారుతుండటంతో దుర్వాసనతో నిత్యం ఇబ్బందులు పడుతున్నామని, దోమలు వృద్ధి చెంది ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని కాలనీవాసులు పేర్కొన్నారు. బాల్‌రెడ్డి, వేణుగోపాల్, మాల్యానాయక్, భూక్యానాయక్, రజిత తదితరులు పాల్గొన్నారు.

గోవా మద్యం పట్టివేత

వికారాబాద్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): గోవా నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యంను ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్న సంఘటన వికారాబాద్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో గోవా నుంచి వస్తున్న వాడ్కోడగామా ఎక్స్‌ప్రెస్‌ను ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు చేస్తుండగా.. ఓ వ్యక్తి 45 రకాల ఎన్‌డీపీఎల్ బాటిళ్లు(సుమారు 36.04 లీటర్లు) కలిగి ఉన్నాడు. ఈమేరకు అతడి నుంచి మద్యంను స్వాధీనం చేసుకున్నారు. వికారాబాద్ డీటీఎఫ్ టీం, వికారాబాద్ ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు.



డేంజర్ బెల్స్!

శరవేగంగా అడుగంటుతున్న భూగర్భజలాలు

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో డేంజర్ బెల్స్ మోగుతున్నాయి. భూగర్భనీటి నిల్వలు శరవేగంగా పడిపోతున్నాయి. యాసంగి సీజన్‌లో సరిపడా వానలు కురవక, నీటి వినియోగం పెరిగిపోవడంతో గంగమ్మ అడుగంటిపోతోంది. నెల వ్యవధిలోనే మీటరు లోతుకు జలాలు పడిపోవడం పంటల సాగుపై ప్రభావం చూపుతోంది. నీటి వసతి లేక యాసంగిలో సాగు విస్తీర్ణం 50 శాతం కూడా దాటలేదు. బోర్లు ఉన్న రైతులు మాత్రమే పంటలు సాగుచేసుకుంటున్నారు.

- ఇబ్రహీంపట్నంలో అత్యధికంగా 14.11 మీటర్ల లోతుకు..
- శివార్లలో పరిస్థితి ఆందోళనకరం
- యాసంగి పంటల సాగుపై ప్రభావం
- రబీలో లోటు వర్షపాతంతో పెరిగిన తీవ్రత

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) :

ఉమ్మడి జిల్లాలో భూగర్భజలాలు గణనీయంగా పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. వానాకాలం (ఖరీఫ్) సీజన్‌లో విస్తారంగా వర్షాలు కురిసినప్పటికీ యాసంగి (రబీ) సీజన్‌లో అంతంత మాత్రంగానే వర్షాలు పడడంతో భూగర్భజలాలు పెరగలేదు. మరోవైపు నీటి వినియోగం పెరగడంతో శరవేగంగా భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. నవంబర్ నెలాఖరు నుంచి డిసెంబర్ నెలాఖరు వరకు భూగర్భజలాల పరిస్థితి పరిశీలిస్తే ఒక్క నెలలోనే సగటున మీటర్ లోతుకు భూగర్భజలాలు పడిపోయాయి. గడిచిన రెండు నెలల కాలంలో ఉమ్మడిజిల్లాలో సగటు దాదాపు రెండున్నర మీటర్ల లోతుకు భూగర్భజలాలు పడిపోవడం గమనార్హం. భవిష్యత్తులో కూడా వర్షాలు పడే అవకాశాలు పెద్దగా లేకపోవడంతో వేసవిలో సాగునీటితో పాటు తాగునీటి ఎద్దడి తలెత్తే ప్రమాదం కనిపిస్తోంది. ముఖ్యంగా నగర శివార్లలో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. హయత్‌నగర్, శేరిలింగంపల్లి, సరూర్‌నగర్ తదితర మండలాల్లో భూగర్భనీటి నిల్వలు శరవేగంగా పడిపోతున్నాయి. మరో వైపు వర్షాల లేమి యాసంగి పంటల సాగుపై కూడా తీవ్ర ప్రభావం

- మిగతా 7వ పేజీలో..

భూగర్భజలాల పరిస్థితి మీటర్లలో (నెలలో..)

జిల్లా	నవంబర్	డిసెంబర్	వ్యత్యాసం
రంగారెడ్డి	8.32	9.08	-0.76
మేడ్చల్	9.27	10.35	-1.08
వికారాబాద్	9.57	10.65	-1.08

2023 డిసెంబర్‌తో పోలిస్తే భూగర్భ జలాల వ్యత్యాసం

రంగారెడ్డి	-0.40
మేడ్చల్	-1.85
వికారాబాద్	0.66

శిథిలావస్థలో కల్వర్టు

- ఒకవైపు కుంగిన వైనం
- పట్టించుకోని అధికారులు
- భయాందోళనలో వాహనదారులు

- 8వ పేజీలో..



32 ప్యాకెట్ల చైనా మాంజా స్వాధీనం

- రూ.6,400 విలువైన మాంజా సీజ్
- పట్టుకున్న జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు

- 8వ పేజీలో..



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు, పక్కన కలెక్టర్, ఎమ్మెల్యేలు, ఎంపీ

ఉగాది నుంచి సన్నబియ్యం

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

రంగారెడ్డి అర్బన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : రానున్న ఉగాది నుంచి పౌర సరఫరాల దుకాణాలలో సన్నబియ్యం ఇవ్వటానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. శనివారం రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, సంక్షేమ పథకాల అమలుపై ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అవగాహన సదస్సును రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయి, మున్సిపల్ స్థాయిలో పర్యటించే బృందంలో వ్యవసాయ రెవెన్యూ, పౌరసరఫరాల శాఖల ప్రతినిధులు తప్పని సరిగా ఉండాలని తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబానికి రెండు విడతలుగా రూ.12 వేలు అందజేస్తామన్నారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు అవకాశం ఇవ్వాలన్నారు. శాసన సభ్యులు సూచించిన విధంగా అర్బన్, రూరల్ ప్రాంతంలో గాని ప్రభుత్వ భూమి ఉన్నట్లయితే రెండో విడతలో రాజీవ్ స్వగృహ మాదిరిగా 10 అంతస్తుల భవన సముదాయం నిర్మించి ఇల్లులేని వారికి అందజేస్తామన్నారు.2014 జీవో ప్రకారం అర్హులను ఎంపిక చేసి రేషన్ కార్డులు అందజేయాలన్నారు. సాగు భూములకు మాత్రమే రైతు భరోసా అందేలా చూడాలని అధికారులకు మంత్రి సూచించారు.

సంక్షేమ పథకాల్లో అర్హులైన ప్రతీ ఒక్కరికి లబ్ధి

ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో అర్హులైన ప్రతీ ఒక్కరికి లబ్ధిచేకూరేలా చూడాలని ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి తారతమ్యాలు లేకుండా అర్హులైన పేదలకు లబ్ధిచేకూరేలా ఎంపిక జరగాలని తెలిపారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేల సూచనలు, అభిప్రాయాలను అధికారులు పరిగణనలోకి తీసుకోవాలని తెలిపారు. జనవరి 26న గణతంత్ర దినోత్సవం నుంచి అమలు చేసే రైతు భరోసా, ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకాలకు లబ్ధిదారుల ఎంపికలో ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలన్నారు. ఈ నాలుగు పథకాల అమలుపై గ్రామ, మున్సిపల్ స్థాయిలో గ్రామసభలు నిర్వహించి లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి లిస్టులను అందుబాటులో ఉంచాలన్నారు. గ్రామసభలు నిర్వహించే ముందు ఆయా ప్రాంతాల్లో దండోరా వేయించాలన్నారు.

పథకాల అమలుకు షెడ్యూల్ రెడీ : జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి మాట్లాడుతూ నాలుగు పథకాలకు సంబంధించి ఈనెల 11నుంచి 13 వరకు షెడ్యూల్ తయారు చేయడం జరిగిందని, 16 నుంచి 20 వరకు

- మిగతా 7వ పేజీలో..


ఘనంగా కుడారై ఉత్సవం

పెద్దసంఖ్యలో హాజరైన భక్తులు



పూజలో భక్తులు

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ధనుర్మాస వ్రత పూజల్లో భాగంగా ఘట్‌కేసర్ మండలం, ఎదులాబాద్‌లోని గోదాసమేత శ్రీ మన్నారు రంగనాయకస్వామి దేవాలయంలో శనివారం ఘనంగా కుడారై ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజామునే ఆలయంలో అమ్మవారికి తిరుప్పావై ఆలకించి, అభిషేకాలు, భక్తులకు అర్చనలు నిర్వహించారు. 11 గంటలకు ఆలయ ఆవరణలో స్వామివారిని ప్రత్యేక వేదికపై అలంకరించారు. వెయ్యి గంగాళాలు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. వెయ్యి మందికి గంగాళాల్లో పాయసం వేసి భక్తులకు అందజేశారు. అనంతరం అమ్మవారికి భక్తులు ఒడిబియ్యం, పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా మంగళహారతి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయధర్మకర్తలు టీపీ లక్ష్మణాచార్యులు, రాజగోపాలచార్యులు, అనంత సేనామాచార్యులు, పురుషోత్తమాచార్యులు, అచ్యుతాచార్యులు, శ్రీవాత్సవాచార్యులు, శ్రీపతిచార్యులు, భక్తులు పాల్గొన్నారు.







మండల కాంగ్రెస్‌లో లోపించిన సమన్వయం

- పార్టీ పెద్దలు జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాలి
- పార్టీ సీనియర్ నాయకుడు కీసరి సంజీవరెడ్డి


మాట్లాడుతున్న సంజీవరెడ్డి

మొయినాబాద్ రూరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మొయినాబాద్ మండలంలో కాంగ్రెస్ పార్టీ అస్తవ్యస్తంగా ఉందని, నాయకుల మధ్య సమన్వయ లోపం కనిపిస్తోందని సీనియర్ నాయకుడు కీసరి సంజీవరెడ్డి అన్నారు. శనివారం ఆయన మండలంలోని అజీజ్‌నగర్‌లోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సీనియర్ నాయకులు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని, ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికల్లో కార్యకర్తలు ఎంత శ్రమించినా గుర్తింపు లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్లుగా పార్టీని నమ్ముకున్న సీనియర్ నాయకులను గుర్తించడం లేదని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలో ఆరు గ్యారంటీలను సక్రమంగా అమలు చేస్తున్నా ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో కాంగ్రెస్ శ్రేణులు విఫలమయ్యారని ఆరోపించారు. వాళ్ల పబ్లిసిటీ కోసమే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని ఆయన అన్నారు. ప్రజల్లో కాంగ్రెస్ పాలనపై మంచి అభిప్రాయం ఉందని, దానిని సద్వినియోగం చేసుకోవడం లేదని అభిప్రాయపడ్డారు. మొయినాబాద్‌లో నెలకొన్న వర్గ విభేదాలపై పార్టీ పెద్దలు జోక్యం చేసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య పార్టీలోని సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు. సీనియర్లకు పార్టీలో సముచిత స్థానం కల్పించాలని సూచించారు. లేకుంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మొయినాబాద్ మండలాన్ని మున్సిపాలిటీ చేయడం ద్వారా కొంత నష్టమని, అయితే ప్రభావిత ప్రాంత ప్రజలకు ఏ మేరకు హామీలు ఇస్తారో ప్రకటించిన తర్వాతనే మున్సిపాలిటీ ఏర్పాటు చేయాలని కోరారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కలిసికట్టుగా పనిచేద్దామని ఆయన పిలుపునిచ్చారు.

లైసెన్స్ లేని వాహనదారులకు కౌన్సెలింగ్


ద్విచక్ర వాహనదారుడికి కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

యాచారం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): యాచారం మండలంలోని మేడిపల్లి సమీపంలో హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ ఇన్‌స్పెక్టర్ లిక్కి కృష్ణంరాజు, ఎస్సై తేజంరెడ్డి వాహన తనిఖీలు చేపట్టారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని ద్విచక్ర వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. పండగ వేళ ఆటోల్లో సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని సూచించారు. అతివేగం ప్రమాదానికి కారణమవుతుందని, రోడ్డు నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు. హైదరాబాద్-నాగార్జునసాగర్ ప్రధాన రహదారిపై నక్కగుట్టతండా వద్ద యాచారం సీఐ నర్సింహరావు, ఎస్సై మధు వాహనాలు తనిఖీ చేశారు. అతివేగంతో వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వాహనదారులకు సూచించారు. ఓవర్‌టేక్ చేయబోయి ప్రమాదాలకు గురికావద్దన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే డ్రంకెన్ డ్రైవ్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పరిశ్రమల సందర్శనతో నైపుణ్యం మెరుగు


బిస్కెట్ పరిశ్రమ సందర్శనకు వెళ్తున్న విద్యార్థులు

మొయినాబాద్ రూరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో పరిశ్రమలను సందర్శించడం ద్వారా నైపుణ్యం మెరుగుపడుతుందని అరిస్టాటిల్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ లోకసాని శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిలుకూరు రెవెన్యూ పరిధిలో గల కళాశాలకు చెందిన విద్యార్థులు శనివారం నగరంలోని పార్లేజీ బిస్కెట్ తయారీ పరిశ్రమను సందర్శించారు. పరిశ్రమలో బిస్కెట్‌లు ఉత్పత్తి అవుతున్న తీరును పరిశీలించారు. ప్యాకింగ్ విధానాన్ని, స్వచ్ఛత గూర్చి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్లు శ్వేత, రాజేందర్‌రెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోలార్ పంపుసెట్ల ఏర్పాటు హర్షణీయం


కులకచర్లలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కులకచర్ల, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీ (చెంచు) రైతుల పొలాల్లో వందశాతం సబ్సిడీతో సోలార్ పంపు సెట్లను ఏర్పాటు చేయడం హర్షణీయమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. కులకచర్లలో శనివారం డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు, సొసైటీ చైర్మన్ కనకం మొగులయ్య, పాంబండ దేవాలయ చైర్మన్ మహిపాల్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొమురం భీమ్ జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించినట్లు తెలిపారు. ఆదివాసీ పిల్లలు ప్రాథమిక స్థాయి నుంచి గొండ్రు భాషలో అభ్యసించవచ్చునని ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. ఆదివాసీలు నీరు లేక భూముల్లో రెండు పంటలు సాగు చేయడం లేదని ప్రభుత్వం కుసుము పథకం ద్వారా బోర్లు వేసి సోలార్ మోటార్లు ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ప్రభుత్వం వారి ఇళ్లకు కూడా సోలార్ లైట్లు ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, నాయకులు, మాజీ సర్పంచ్ వెంకటయ్యగౌడ్, మాజీ మండల అధ్యక్షుడు వెంకటయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం గ్రామ కమిటీ



కందుకూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడూరులో సీపీఎం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ తెలిపారు. శనివారం ఉదయం ఆ పార్టీ సీనియర్ నాయకులు గౌర శ్రీశైలం, అంజయ్యల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కార్యదర్శిగా యాదయ్య, సహాయ కార్యదర్శిగా ప్రభు, సభ్యులుగా వినోద్, అంజయ్య, శ్రావణి, చిలుకల జంగయ్య, కొమురయ్యను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. కాగా, అన్ని గ్రామాల్లో పార్టీ కమిటీలను త్వరలో ఎన్నుకోనున్నట్లు బాల్‌రాజ్ తెలిపారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేస్తున్నదని, సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీల అమలులో విఫలమయ్యారని ఆయన ఆరోపించారు.

గురుకుల ఎంట్రెన్స్ బ్రోచర్ ఆవిష్కరణ

తాండూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరంకు సంబంధించి ఎంట్రెన్స్ బ్రోచర్‌ను శనివారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అధికారులు, పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ధారాసింగ్, చైర్ పర్సన్ స్వప్న, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హబీబ్‌లాలా, కౌన్సిలర్లు నీరజ బాల్‌రెడ్డి, సోమశేఖర్, వెంకన్నగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బొంరాస్‌పేట్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు సీఎంఆర్ఎఫ్ అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు దాసరి చంద్రప్ప అన్నారు. మండలంలోని రేగడిమైలారంలో శనివారం బంటు కృష్ణప్పకు రూ.65వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు గుండప్ప, కాంగ్రెస్ నాయకులు వెంకట్‌రెడ్డి, శ్రీశైలం, నందు, శేఖరయ్య, ప్రసాద్‌గౌడ్, చిన్న నర్సింహులు, వెంకటేశ్ పాల్గొన్నారు.

గెలుపోటములు సహజం

బషీరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపోటములు సహజమని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. తాండూరులో మూడు రోజుల పాటు నిర్వహించిన బీఎంఆర్ కప్ వాలీబాల్ పోటీల్లో విజేతలుగా నిలిచిన బషీరాబాద్ మండల విద్యార్థులకు శనివారం ఆయన బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, నవాంద్గీ పీఏసీఎస్ వైస్‌చైర్మన్ అజయ్‌ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు, రిటైర్డ్ టీచర్ నర్సిరెడ్డి, మాణిక్‌రావు, అనిల్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా వడ్డె ఓబన్న జయంతి



మందిపాల్ గ్రామంలో వడ్డె ఓబన్న జయంతిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎల్పటి అశోక్‌కుమార్, నాయకులు

చౌడాపూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): చౌడాపూర్ మండలంలోని మందిపాల్ గ్రామంలో శనివారం స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎల్పటి అశోక్ కుమార్ మాట్లాడుతూ.. సంచార జాతి వడ్డెర కులానికి చెందిన వడ్డె ఓబన్న జనవరి 11న రేనాటి ప్రాంతంలో జన్మించారని తెలిపారు. బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ ఆధీనంలో ఉన్న సమయంలో వడ్డె ఓబాన్న సైన్యాధ్యక్షుడిగా పోషించిన వీరోచిత పోరాటం చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మందిపాల్ గ్రామస్థులు కోకటం శివశంకర్, వడ్డె బాల్‌రాజ్, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

కీసరలో ట్రాఫిక్ ఇక్కట్లు



కీసర చౌరస్తాలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తున్న సీఐ వెంకటయ్య

కీసర, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కీసరలో శనివారం ట్రాఫిక్‌తో వాహనదారులతో పాటు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సివచ్చింది. కీసర, అంకిరెడ్డిపల్లి, భోగారం గ్రామాల్లోని గురుకుల పాఠశాలలకు సంక్రాంతి సెలవులు రావడంతో విద్యార్థులతో పాటు, వారి తల్లిదండ్రులు వాహనాల్లో రావడం, మరికొంత మంది కీసర బస్టాప్‌లో బస్సుల కోసం నిరీక్షించడం, మరోపక్క రోడ్డుపైనే చిరువ్యాపారులు తోపుడుబండ్లు, ఆటోలు పార్కింగ్ చేయడంతో కీసర ప్రధాన చౌరస్తాలో ఒక్కసారిగా ట్రాఫిక్ స్తంభించింది. దీంతో కీసర పోలీస్ స్టేషన్ సీఐ వెంకటయ్య తన సిబ్బంది కీసర ప్రధాన చౌరస్తాకు చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. రోడ్డును ఆక్రమించి వ్యాపారాల నిర్వహణ, ఆటోలు ఇష్టానుసారంగా పార్కింగ్ చేయడం వల్ల తరచూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనేఆ సంబంధిత అధికారులు కీసర ప్రధాన చౌరస్తాలో ట్రాఫిక్ సమస్య రాకుండా తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

రోడ్డు కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి



ఆందోళన చేస్తున్న రాజిరెడ్డి నగర్ కాలనీ వాసులు

కీసర, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కాలనీలో రోడ్డు కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలని నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాజిరెడ్డి నగర్ కాలనీవాసులు శనివారం ఆందోళన వ్యక్తం చేశారు. నాగారం పరిధి సర్వేనంబర్ 148లో గల 40 ఫీట్ల రోడ్డును కబ్జా చేసేందుకు రాజేందర్‌రెడ్డి, తన అనుచరులు ప్రహరీని కూల్చివేశారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. కబ్జా చేసే వారికి ఎవరైనా అడ్డు చెబితే బెదిరింపులకు పాల్పడుతున్నారని కాలనీవాసులు వాపోయారు. కబ్జా పర్వంపై మున్సిపల్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజలు వినియోగించాల్సిన రోడ్డును కబ్జాకాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరారు.

బల్దియా పాలకవర్గం కౌంట్ డౌన్ షురూ

తాండూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పాలకవర్గం కౌంట్ డౌన్ ప్రారంభమైంది. సరిగ్గా జనవరి 26 నాడే మున్సిపాలిటీ పాలకవర్గాల గడువు ముగుస్తుంది. ఇంకా 15రోజుల మాత్రమే మిగిలిఉంది. ఐదేళ్ల పాలనకు గానూ 2020 జనవరి 27న పాలకవర్గాలు బాధ్యత చేపట్టిన విషయం తెలిసిందే. తాండూరు మున్సిపాలిటీలో చివరి మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్‌పై కౌన్సిలర్లు డిమాండ్ చేస్తున్నారు. చివరి పాలకవర్గ సమావేశాన్ని సంక్రాంతి పండుగ తర్వాత నిర్వహించేందుకు చైర్‌పర్సన్, అధికారులు కసరత్తు చేస్తున్నారు. గడువు దగ్గర పడుతుండటంతో కౌన్సిలర్లు పెండింగ్ పనులపై అధికారులపై ఒత్తిడి పెంచారు. సర్పంచ్, మండల పరిషత్ పదవీ కాలం ముగిసి ఏడాది దగ్గర పడుతున్నా ఎన్నికలు జరగనందున మున్సిపల్ ఎన్నికల నిర్వహణ కూడా ఆలస్యమయ్యే అవకాశాలు ఉండటంతో అప్పట్లోగా కాలనీలో అవసరమైన అభివృద్ధి పనులు చేయించుకునేందుకు కృషి చేస్తున్నారు. 15రోజుల పదవీ కాలంలో ఐదు రోజులు సెలవులే ఉన్నాయి. ఈనెల 13వ తేదీన భోగి, 14 సంక్రాంతి, 15న కనుమ, 19న ఆదివారం, 26న రిపబ్లిక్ డే మిగిలిన వర్కింగ్ డేలు 10రోజులు మాత్రమే ఉన్నాయి. ఈ 10రోజుల్లో ఒకరోజు చివరి సమావేశానికే పూర్తవుతుంది. మిగతా తొమ్మిది రోజుల్లోనే ఏమైనా అభివృద్ధి పనులు కౌన్సిలర్లు చేయించుకోవాల్సి ఉంటుంది.

డేంజర్ బెల్స్!

(5వ పేజీ తరువాయి)

చూపిస్తోంది. సాధారణంగా అక్టోబర్ మొదటి వారం నుంచి పంటలకు యాసంగి సీజన్ ప్రారంభమవుతుంది. ఈ సీజన్‌లో వర్షాలు లేకపోవడం వల్ల యాసంగిలో పంటల సాగు అంతంత మాత్రంగానే ఉంది. కొన్నిచోట్ల సీజన్‌లో కనీస స్థాయిలో కూడా వర్షాలు పడలేదు. దీంతో అనేక మండలాల్లో ఇంకా ఆరుతడి పంటలు మొదలు కాలేదు. బోర్లు ఉన్నవారు మాత్రమే సాగు పనులు చేస్తున్నారు. ఈ కారణంగా యాసంగి పంటలు సాగు విస్తీర్ణం 50శాతం దాటలేదు. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో యాసంగి పంటలు సాగు 25శాతం లోపుగానే ఉన్నట్లు వ్యవసాయశాఖ తాజాగా ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో పేర్కొంది. వికారాబాద్ జిల్లాలో పరిస్థితి కొంత మెరుగ్గా ఉన్నా.. ఆశించిన స్థాయిలో పంటలు సాగు చేయలేదు. వికారాబాద్ జిల్లాలో 50శాతం లోపుగానే పంటలు సాగు ఉంది. యాసంగి సీజన్‌లో పంటలు వేసేందుకు సమయం కూడా దాటిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బోర్లు ఉన్న రైతులు మాత్రం ప్రత్యామ్నాయ పంటలు వేసేందుకు సిద్ధమవుతున్నారు.

51శాతం లోటు వర్షపాతం

మూడు జిల్లాల్లో యాసంగి సీజన్‌లో కనీస స్థాయిలో కూడా వర్షాలు లేకపోవడంతోనే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈసారి రంగారెడ్డి జిల్లాలో ఇప్పటి వరకు సగటు 123.5 మి.మీ వర్షం కురవాల్సి ఉండగా.. 62మి.మీ వర్షపాతమే కురిసింది. అంటే దాదాపు 51శాతం లోటు వర్షపాతం నమోదైంది. అలాగే మేడ్చల్ జిల్లాలో 42శాతం, వికారాబాద్ 16శాతం తక్కువ వర్షం కురిసింది. యాసంగి పంటల సాగుకు కీలకమైన నవంబర్, డిసెంబర్ నెలల్లో వర్షాలు పడకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

శరవేగంగా పడిపోతున్న భూగర్భజలాలు

రంగారెడ్డిజిల్లాలో వానాకాలం 32శాతం అధిక వర్షపాతం నమోదైంది. అలాగే వికారాబాద్ జిల్లాలో 41శాతం, మేడ్చల్ జిల్లాలో 21శాతం అధిక వర్షపాతం నమోదైంది. దీంతో ఉమ్మడి జిల్లాలో భూగర్భజలాలు గణనీయంగానే పెరిగాయి. అయితే యాసంగి సీజన్‌లో కనీస స్థాయిలో కూడా వర్షాలు పడలేదు. ఈ సీజన్‌లో రంగారెడ్డిజిల్లాలో 40శాతం లోటు వర్షపాతం నమోదైంది. అలాగే మేడ్చల్ జిల్లాలో 38శాతం, వికారాబాద్ జిల్లాలో 10శాతం తక్కువ వర్షాలు పడ్డాయి. ఒక వైపు లోటు వర్షపాతంతో పాటు మరో వైపు విచ్చలవిడిగా నీటి వాడకం పెరగడంతో భూగర్భజలాలు శరవేగంగా పడిపోతున్నాయి.

ఇబ్రహీంపట్నంలో అత్యధికంగా...

ఇబ్రహీంపట్నం మండలంలో అత్యధికంగా 14.11 మీటర్ల లోతుకు భూగర్భజలాలు పడిపోయాయి. సరూర్‌నగర్ మండలంలో 12.66 మీటర్లు, శేరిలింగంపల్లి మండలంలో 12.59 మీటర్లు, తలకొండపల్లి మండలంలో 12.43 మీటర్లు, హయత్‌నగర్ మండలంలో 10.95 మీటర్లు, మంచాలలో 10.29 మీటర్ల లోతుకు భూగర్భజలాలు పతనమయ్యాయి.

శేరిలింగంపల్లిలో శరవేగంగా ..

గత ఏడాదితో పోలిస్తే 16 మండలాల్లో భూగర్భజలాలు పెరగగా 11 మండలాల్లో భూగర్భజలాలు పడిపోయాయి. నవంబరుతో పోలిస్తే అన్ని మండలాల్లో భూగర్భజలాలు గణనీయంగా తగ్గాయి. ఒక్క నెలలో అత్యధికంగా శేరిలింగంపల్లి మండలంలో 2.48 మీటర్ల భూగర్భజలాలు పడిపోయాయి. అలాగే సరూర్‌నగర్‌లో 1.79మీటర్లు, ఇబ్రహీంపట్నంలో 1.61 మీటర్లు, హయత్‌నగర్‌లో 1.09 మీటర్లు నీటి మట్టాలు తగ్గాయి.

యాసంగిలో వర్షపాతం వివరాలు (మి.మీ)

జిల్లా	సాధారణ వర్షపాతం	ఇప్పటి వరకు కురిసిన వర్షపాతం	తగ్గుదల శాతంలో
రంగారెడ్డి	128.2	77.5	-40
మేడ్చల్	126.6	72.8	-38
వికారాబాద్	102.7	86.6	-10

క్రీడాకారులకు సంపూర్ణ సహకారం అందిస్తా



టోర్నమెంట్‌లో గెలుపొందిన జట్టుకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

యాలాల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): క్రీడలకు సంపూర్ణ సహకారం అందిస్తానని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. తాండూరులోని గౌతమి మోడల్ స్కూల్‌లో శనివారం ఎమ్మెల్యే బీఎస్ఆర్ కప్-2025 టోర్నమెంట్ ఫైనల్స్ జరిగాయి. ఈ సందర్భంగా కార్యక్రమంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని సూచించారు. ప్రతీ క్రీడలో గెలుపోటములు సహజమేనని అన్నారు. ఓటమి చెందితే బాధపడకుండా ఇంకా పట్టుదలతో కృషి చేయాలని సూచించారు. ఓటమిని గెలుపునకు నాందిగా మలుచుకోవాలన్నారు. అదేవిధంగా యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా, మంచి అలవాట్లు మెరుగుపరుచుకోవాలని సూచించారు. టోర్నమెంట్‌కు అన్ని విధాలుగా సహకరించి విజయవంతం చేసిన వ్యాయామ ఉపాధ్యాయులకు, గౌతమి మోడల్ స్కూల్ యాజమాన్యానికి , నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. క్రీడల్లో ప్రభుత్వ, ప్రైవేటు 50 పాఠశాలల నుంచి 191 టీంలు, 2100 మంది క్రీడాకారులు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్, గౌతమి మోడల్ స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మారెడ్డి, ఎంఈవో సుధాకర్‌రెడ్డి, కరస్పాండెంట్ మైపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కొండల్‌రెడ్డి, యాలాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్సిరెడ్డి, తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, ధారాసింగ్, పురుషోత్తంరావు, నర్సిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

క్రీడల్లో విజేతలు వీరే..

కబడ్డీ బాలికల విభాగంలో మొదటి బహుమతి యాలాల జడ్పీ ఉన్నత పాఠశాల జట్టు, రెండు బహుతి గౌతమి మోడల్ స్కూల్, మూడో బహుమతి అగ్గనూరు జడ్పీ ఉన్నత పాఠశాల జట్టు, కబడ్డీ బాలుర విభాగంలో మొదటి బహుమతి బహుతి గౌతమి మోడల్ స్కూల్, రెండో బహుమతి పగిడ్యాల్ జడ్పీహెచ్ఎస్, మూడో బహుమతి జడ్పీహెచ్ఎస్ మంబాపూర్, ఖోఖోలో మొదటి బహుమతి గౌతమి మోడల్ స్కూల్, రెండో బహుమతి అక్షర కాన్సెప్ట్ స్కూల్, మూడో బహుమతి నలంద స్కూల్, ఖోఖో బాలికల విభాగంలో అగ్గనూరు జడ్పీ ఉన్నత పాఠశాల జట్టు, రెండో బహుమతి కృష్ణవేణి కాన్సెప్ట్ స్కూల్, మూడో బహుమతి సేయింట్ మార్క్స్ స్కూల్ విద్యార్థుల జట్టు గెలుపొందాయి.

మట్టి తరలింపులో ఇరువురి మధ్య ఘర్షణ

- టిప్పర్ యజమానిని చితకబాదిన కాంట్రాక్టర్
- పోలీసులకు బాధితుడి ఫిర్యాదు.. విచారణ



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆనంద్

మేడ్చల్ టౌన్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మట్టిని తరలించే వ్యవహారంలో ఓ టిప్పర్ యజమానిని కాంట్రాక్టర్ చితకబాది ఆసుపత్రి పాల్జేశారు. అక్రమంగా మట్టి తరలించే వారు గొడవ పడటంతో వ్యవహారం బయటపడింది. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయ పరిధిలో నిర్మిస్తున్న ఐటీ పార్కు కాంట్రాక్టును బెంగుళూరుకు చెందిన ఓ ప్రైవేటు కంపెనీ తీసుకుంది. నిర్మాణ పనుల్లో భాగంగా అక్కడ జరుపుతున్న తవ్వకాల ద్వారా తీస్తున్న మట్టిని తరలించే సబ్ కాంట్రాక్టును గంగాధర్ అనే వ్యక్తికి అప్పగించారు. దాంతో గంగాధర్ ఐటీ పార్కు వద్ద తవ్విన మట్టిని కొందరు ప్రైవేటు వ్యక్తులకు అమ్మి సొమ్ముకుంటున్నాడు. గంగాధర్ వద్ద నుంచి మట్టిని కొంటున్న టిప్పర్ల యజమానులు రహదారి నిర్మాణ పనులకు ఎక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. విషయం తెలుసుకున్న గంగాధర్ నేరుగా రహదారుల సంస్థకు చెందిన వారితో సంప్రదింపులు జరిపి.. నేరుగా తానే మట్టిన తరలించే పని మొదలు పెట్టాడు. దాంతో గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి చెందిన ఆనంద్ అనే టిప్పర్ యజమాని తన టిప్పర్‌కు లోడ్ మట్టి ఇవ్వాలని శుక్రవారం రాత్రి ఐటీ పార్కుకు వెళ్లగా.. గంగాధర్ అందుకు తిరస్కరించాడు. దాంతో ఇరువురి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. ఈక్రమంలో గంగాధర్ అనుచరులు ఆనంద్‌పై దాడికి పాల్పడ్డారు. అనంతరం ఆనంద్ సహచరులు అతనిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. శనివారం మేడ్చల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడు ఆనంద్ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా మట్టి తవ్వకాలు!

కాగా, మట్టి గొడవపై విచారణ జరుపుతున్న అధికారులకు, పోలీసులకు పలు ఆసక్తికర విషయాలు తెలిశాయి. మట్టిని తరలించటానికి గంగాధర్‌కు సబ్ కాంట్రాక్టు ఇవ్వగా.. అతడు మైనింగ్ అధికారులతో ఎలాంటి అనుమతి లేకుండా తవ్వకాలు జరిపి విక్రయాలకు పాల్పడిన విషయం బహిర్గతమైంది. మట్టి తరలించే విషయంలో సబ్‌కాంట్రాక్టర్ గంగాధర్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు సమాచారం. ఐటీ పార్కు నిర్మాణపు పనులకు సైతం పూర్తిస్థాయిలో అనుమతులు లభించకముందే పనులు ప్రారంభించి మట్టి అమ్ముకునే ప్రయత్నం చేసినట్టు సమాచారం. విచారణ జరుపుతున్న పోలీసులు మైనింగ్ శాఖ అనుమతులు లేకుండా తవ్వకాలు జరిపినట్టు ప్రాథమికంగా నిర్ధారించారు.

ఆలయాల పరిరక్షణకు చర్యలు



కరపత్రాన్ని విడుదల చేస్తున్న మంత్రి

కందుకూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): దేవాలయాల పరిరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబు అన్నారు. శనివారం మండలంలోని పులిమామిడి చీకటి వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు సంబంధించిన కరపత్రాన్ని నగరంలోని ఆయన నివాసంలో విడుదల చేశారు. ఫిబ్రవరి 10 నుంచి 14వరకు శ్రీలక్ష్మీ కల్యాణ వైభవ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ ధర్మకర్త ఎం.రాజశేఖరశర్మ తెలిపారు. 12న స్వామివారి కల్యాణ మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అలాగే బ్రహ్మోత్సవాల నేపథ్యంలో దేవాలయం అవరణలో స్వామివారి కల్యాణ మండపాన్ని అధునాతనంగా నిర్మించడానికి శంకుస్థాపన చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గూడ రాజేశ్వరరావు, సర్వ రాఘవేంద్రరావు, వింజమూరి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఉగాది నుంచి సన్నబియ్యం

(5వ పేజీ తరువాయి)

ఆయా శాఖల బృందాలు లబ్ధిదారులలో అర్హులను గుర్తించి 21 నుంచి 24వ తేదీ వరకు ఆయా గ్రామసభల్లో మున్సిపల్ వార్డులలో జాబితాను ఉంచడం జరుగుతుందని తెలిపారు. రైతు భరోసాలో రెవెన్యూ, వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వ్యవసాయ యోగ్యం భూములను గుర్తించాలని, కొత్త రేషన్ కార్డులు ఎంపికలు బృందాలుగా వెళ్లి నిజమైన అర్హులను ఎంపిక చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో భూమి లేని వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పనిలో2023-24 సంవత్సరంలో జాబ్ కార్డులు కలిగిన వారిని ఎంపిక చేయాలని అన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న పలువురు శాసన సభ్యులు కొంత మంది రైతులకు రుణమాఫీ రాలేదని, సన్నబియ్యం బోనస్ 500 రూపాయలు కొన్ని ప్రాంతాలలో బ్యాంకుల నుండి రైతులకు సంబంధించిన బ్యాంక్ ఖాతాలో జమ కాలేదని తెలిపారు. దీనిపై స్పందించిన మంత్రి వెంటనే లీడ్ బ్యాంక్ అధికారికి వివరాలు ఇచ్చి ఆ రైతుల ఖాతాలో జమ అయ్యే విధంగా చూడాలని ఉమ్మడి జిల్లాల కలెక్టర్లకు సూచించారు. ఈ సమావేశంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బొగారపు దయానంద్, శాసన సభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి, కాలె యాదయ్య, అరికెపూడి గాంధీ, ప్రకాష్‌గౌడ్, వీర్లపల్లి శంకర్, ఫ్లాగ్ షిప్ ప్రాజెక్టు కమీషనర్ కె.శశంక, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పొట్రు, వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజేందర్‌రెడ్డి, వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, మూడు జిల్లాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పాంబండ గిరిప్రదక్షిణకు ఏర్పాట్లు

కులకచర్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పాంబండ గిరి ప్రదక్షిణకు హిందూ బంధువుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం పౌర్ణమి సందర్భంగా నిర్వహిస్తున్న గిరి ప్రదక్షిణకు భక్తులు పెద్దఎత్తున తరలిరావాలని నిర్వాహకులు కోరారు. గిరిప్రదక్షిణలో పాల్గొనే పురుషులు తెల్ల దుస్తులు, మహిళలు పసుపు దుస్తులు, కాషాయం కండువా ధరించి రావాలని తెలిపారు.

ధారూరు వ్యవసాయ మార్కెట్‌లో బీట్లు

ధారూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ధారూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం సాయంత్రం ధాన్యం, కంది పంట ఉత్పత్తులకు బీట్లు నిర్వహించారు. గత వారం కన్నా ఈ వారం కందుల ధరలు తగ్గాయి. ధాన్యం 1010రకం క్వింటాలుకు రూ.2,200ల నుంచి రూ.2,260 వరకు, సోనా రకం క్వింటాలుకు రూ.2,200ల నుంచి రూ.2,500ల వరకు, కందులు క్వింటాలుకు 7,680ల నుంచి రూ.7,590ల వరకు ధర పలికింది. కాగా గత వారం కందులు క్వింటాలుకు 7,650ల నుంచి 8,04ల వరకు ధర పలకగా ఈ వారం కందుల ధరలు పడిపోయాయి.

ఊరెళ్తున్నారా.. జాగ్రత్త

ఇబ్రహీంపట్నం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి ఊరెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు సూచించారు. వీలైనంతమేర ఇంట్లో విలువైన వస్తువులు, బంగారు ఆభరణాలు పెట్టవద్దని, బ్యాంకు లాకర్లో లేదా భద్రంగా ఉన్నచోట దాచుకోవాలన్నారు. వాహనాలను ఇంటి వద్దనే పార్కుచేసి తాళంచెవిని వెంట తీసుకెళ్లాలన్నారు. ఇంటి ముందు తలుపులకు సెంటర్ లాక్‌వేసి బయట గొళ్లెం పెట్టవద్దన్నారు. ఇళ్లకు నాసిరకం తాళం వాడొద్దని.. తాళం కనబడకుండా కర్టెన్ వేయాలన్నారు. బయట గేటుకు లోపల నుంచి తాళం వేయాలన్నారు. బయటకు వేళ్లే ముందు ఇంట్లో, బయట లైట్ వేయాలన్నారు. పేపర్ బాయ్, పాలవాళ్లను తిరిగొచ్చే వరకు రావద్దని చెప్పాలని సలహా చేశారు. నమ్మకమైన వాచ్‌మ్యాన్‌నే నియమించుకోవాలన్నారు. నమ్మకమైన వారికి ఇంటిని గమనిస్తూ ఉండమని చెప్పాలని.. పోలీస్ స్టేషన్‌లో సమాచారమిస్తే నిఘా పెట్టడానికి వీలుంటుందన్నారు. ఊరెళ్లిన తర్వాత కూడా ఇంటి పక్కవారికి ఫోన్‌చేసి వివరాలు తెలుసుకుంటూ ఉండాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని డీవీఆర్‌ను రహస్య ప్రదేశంలో భద్రపరుచుకోవాలన్నారు. మొబైల్ యాప్ ద్వారా ఎప్పటికప్పుడు వీక్షించాలన్నారు. ఎవరిమీదైనా అనుమానం వస్తే డయల్ 100కు కాల్ చేయాలని ఏసీపీ చెప్పారు.

రంగనాయక స్వామి కల్యాణానికి చెన్నకేశవాలయం ముస్తాబు



కడ్తాల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కడ్తాల మండల కేంద్రంలోని శ్రీ భూనీళా సమేత లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయం శ్రీ గోదాదేవి రంగనాయకుల తిరు కల్యాణోత్సవానికి ముస్తాబైంది. ఆదివారం నిర్వహించే కల్యాణోత్సవం నేపథ్యంలో ఆలయాన్ని శోభాయమానంగా అలంకరిస్తున్నారు. కల్యాణోత్సవానికి హాజరయ్యే భక్తులకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 10:30 గం లకు శ్రీ గోదాదేవి రంగనాయకుల కల్యాణం, ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయని ఆలయ అర్చకుడు, కడ్తాల మాజీ సర్పంచ్ తిరునగరి వేణుగోపాల్ తెలిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఉంటుందని తెలిపారు.

ప్రజాపాలనకు ఆకర్శితులై కాంగ్రెస్‌లో చేరికలు

ఆ పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి



నాయకులకు కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానిస్తున్న కేఎల్ఆర్

మహేశ్వరం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలనకు ఆకర్శితులై ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని, మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జీ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం మహేశ్వరం మండలం సిరిగిరిపురం గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నర్సింహాగౌడ్ ఆధ్వర్యంలో తుక్కుగూడలోని మహేశ్వరం పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కష్టపడే కార్యకర్తలను పార్టీ మరిచిపోదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి మహేశ్వరం నియోజకవర్గాన్ని రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. కార్యకర్తలకు కాంగ్రెస్ అండగా ఉంటుందని పేర్కొన్నారు. పది సంవత్సరాలు కాంగ్రెస్ కార్యకర్తలను బీఆర్ఎస్ నాయకులు నానా ఇబ్బందులకు గురి చేశారని, కాంగ్రెస్ ప్రజల పక్షాన నిలబడి పని చేయాలన్నారు. త్వరలో అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసే ఇందిరమ్మ కమిటీల ద్వారా ప్రభుత్వ పథకాలను అర్హులైన వారికి చేరవేయడంలో కీలక భాధ్యత కమిటీ సభ్యులకే ఉంటుందన్నారు. నియోజకవర్గంలో పార్టీకి పూర్వవైభవం తేవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, నర్సింహాగౌడ్, వత్తుల రఘుపతి, రాజునాయక్, మల్లేశ్, వెంకటేష్, బాల్‌రాజ్, శ్రీను, మహేందర్, రాఘవేందర్, గణేష్, శ్యామ్ పాల్గొన్నారు.

సాగులో లేని భూముల వివరాల సేకరణ



సాగులో లేని భూములను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, ఆర్డీవో సైదులు

ఘట్‌కేసర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగుకు అనువుగా లేని భూముల వివరాలను జిల్లా రెవెన్యూ యంత్రాంగం సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా శనివారం పోచారం మున్సిపాలిటీ పరిధిలోని పోచారంలో సర్వేనెంబర్లు 35, 37, 38, 39, 40, 60, 61లోని వ్యవసాయానికి అణువుగా లేని భూములను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, కీసర ఆర్డీవో సైదులు పరిశీలించి వివరాలు సేకరించారు. అదేవిధంగా యంనంపేట్‌లోని సర్వేనెంబర్ 121, మేడిపల్లి మండలంలోని బోడుప్పల్ సర్వేనెంబర్ 168లోని భూమిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఘట్‌కేసర్ తహసీల్దార్ రజిని, వ్యవసాయ అధికారి బాసిత్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో కల్వర్టు

- ఒకవైపు కుంగిన వైనం
- పట్టించుకోని అధికారులు
- భయాందోళనలో వాహనదారులు



వెంకటాపూర్ సమీపంలో నారాయణరావు చానెల్‌పై శిథిలావస్థకు చేరిన కల్వర్టు



ఒకవైపు కల్వర్టు కుంగటంతో మరోవైపు నుంచి వెళుతున్న బస్సు

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ వెంకటాపూర్ సమీపంలోని నారాయణరావు చానెల్‌పై నిర్మించిన కల్వర్టు శిథిలావస్థకు చేరింది. పీర్జాదీగూడ వద్ద మూసీనదిపై చెక్‌డ్యాం నిర్మాణం చేపట్టి ఘట్‌కేసర్ మండలానికి సాగునీరు అందించాలని నారాయణరావు చానెల్‌ను నిర్మించారు. పీర్జాదీగూడ నుంచి ఎదులాబాద్ వరకు ఈ కాలువ ద్వారా గ్రామాల వద్ద పలు కల్వర్టులను నిర్మించి సాగునీరు అందిస్తున్నారు. నారాయణరావు చానెల్ కాలువ ద్వారా మండలంలో దాదాపు 2వేల ఎకరాలకు పైగా సాగునీరు అందుతోంది. వెంకటాపూర్ వద్ద కల్వర్టు నిర్మించి దాదాపు 40ఏళ్లు గడుస్తోంది. వాహనాల రాకపోకలు ఎక్కువగా సాగుతుండటంతో కల్వర్టు ఒకవైపు కుంగిపోయింది. ఈకల్వర్టు మీదుగా నిత్యం వెంకటాపూర్, తెనుగూడెం, కొర్రెముల గ్రామాల రైతులు, ప్రజలు, వాహనదారులు వెళ్తుంటారు. కల్వర్టుదాటి వెళ్లాలంటే వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని దాటాల్సిన పరిస్థితి నెలకొంది. కల్వర్టు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు, రైతులు అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా ఫలితంలేదు. అధికారులు కల్వర్టు వద్ద ఎలాంటి సూచికబోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కల్వర్టు పరిస్థితి తెలిసినా అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడటంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన కల్వర్టుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



కల్వర్టు మరమ్మతులు చేపట్టాలని అధికారులకు వినతిపత్రాలు అందజేసినా పట్టించుకోవడం లేదు. రాత్రింబవళ్లు నగరానికి గ్రామాలకు రాకపోకలు సాగించే వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని కల్వర్టుదాటాల్సి వస్తుంది. అధికారులు కల్వర్టు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి. **- నీరుడి శ్రీనివాస్, వెంకటాపూర్**

దాతల సహకారంతో కల్వర్టు నిర్మాణం



వెంకటాపూర్ సమీపంలో నారాయణరావు కాలువపై నిర్మించిన కల్వర్టు శిథిలావస్థకు చేరింది. ఇటీవలే వెళ్లి కల్వర్టును పరిశీలించాం. మున్సిపాలిటీలో నిధులు లేవకపోడంతో దాతల సహకారంతో కల్వర్టు నిర్మాణం చేపడుతున్నాం. త్వరలో కల్వర్టు నిర్మించి వెంకటాపూర్, తెనుగూడెం గ్రామాల వారికి ఇబ్బందులు కలగకుండా చూస్తాం. **- బోయపల్లి కొండల్‌రెడ్డి, పోచారం మున్సిపల్ చైర్మన్**

నిధుల్లేక నిస్తేజం!

(5వ పేజీ తరువాయి)

పన్నులుండే పరిస్థితిని అధికారులు, పాలకులు కల్పించారు. వికారాబాద్ మునిసిపాలిటీలో 178 మంది కార్మికులు శానిటేషన్ విభాగంలో పనిచేస్తుండగా.. మిగతావారు కంప్యూటర్ ఆపరేటర్లుగా, ఆఫీస్ సిబ్బందిగా విధులు నిర్వహిస్తున్నారు. మొత్తంగా 250 మంది వరకు పనులు చేస్తుండగా.. వీరికి ప్రతీనెల రూ.50 నుంచి రూ.52లక్షల వరకు మునిసిపాలిటీ నుంచి జీతాలు అందుతాయి.

మంజూరు కాని ప్రత్యేక నిధులు

వికారాబాద్ మున్సిపల్ పాలకవర్గం ఏర్పడిన నాటి నుంచి ప్రత్యేక నిధులు మంజూరు కాలేదు. బీఆర్‌ఎస్ హయాంలోనూ రూపాయి కూడా మంజూరు కాలేదు. అదేవిధంగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా ప్రత్యేక నిధులు ఇవ్వలేదు. మున్సిపాలిటీకి కేవలం పన్ను రూపంలో, ఆర్థిక సంఘం నిధులు, స్టాంప్ డ్యూటీ రూపంలో వచ్చే డబ్బుతోనే కాలం వెల్లదీస్తున్నారు. ఈమేరకు జీతాలు చెల్లిస్తూ పలు అభివృద్ధి పనులకు ఖర్చు చేశారు.

అవినీతికి కేరాఫ్‌గా..!

వికారాబాద్ మున్సిపాలిటీ అవినీతికి కేరాఫ్‌గా మారిందని పలువురు ఆరోపిస్తున్నారు. బిల్లు కలెక్టర్ల నుంచి ఆర్‌ఐ వరకు అవినీతికి పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. మున్సిపల్ పరిధిలోని ఇంటి నెంబర్లు, మ్యుటేషన్ల కోసం వచ్చే దరఖాస్తులకు డబ్బు వసూలు చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. అయితే, ఒక్కొక్కరి వద్ద ఒక్కోలా రూ.2వేల నుంచి రూ.2లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఇందులో రెవెన్యూ శాఖతో పాటు మున్సిపాలిటీలోని ఓ అధికారి హస్తం కూడా ఉన్నట్లుగా ప్రచారం సాగుతోంది. అంతే కాకుండా శానిటేషన్ విభాగంలో కార్మికులకు కొనుగోలు చేసిన బట్టలు, సబ్బులు ఇతర సామగ్రి కొనుగోలులో సైతం పెద్దమొత్తంలో అవినీతి జరిగినట్లుగా అప్పట్లో ప్రచారం జరిగింది. అంతకుముందు కమిషనర్‌గా విధులు నిర్వహించిన వ్యక్తి సైతం పట్టణంలో రోడ్డు మధ్యలో తొట్టీలు, రోడ్డుపక్కన మొక్కల పెంపకం కార్యక్రమాలతో అక్షరాల రూ.40 లక్షల వరకు నిధులు దుర్వినియోగం చేశారని పాలకవర్గ సభ్యులు పలు సందర్భాల్లో తెలిపారు.

కనిపించని అభివృద్ధి

ఐదేళ్లలో మున్సిపాలిటీ పరిధిలోని పలుచోట్ల సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు చిన్న చిన్న పనులు మినహా పెద్దగా అభివృద్ధి పనులు జరిగిన దాఖలాలు లేవు. పన్నులు, ఇతరత్రా వాటిపై వచ్చే డబ్బు కేవలం జీతాలు, మెయింటనెన్స్‌కే సరిపోయేవి. వికారాబాద్ శివసాగర్ చెరువులో పుష్కలంగా నీరు ఉన్నా.. వినియోగానికి అధికారులు చర్యలు తీసుకోలేదు. సీఎం రేవంత్‌రెడ్డి మూసీని ప్రక్షాళన చేస్తానని చెబుతున్న తరుణంలో.. ఆ నదికి జన్మ స్థలమైన వికారాబాద్‌లోనే నీరు కలుషితమౌతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. పట్టణంలోని సీవరేజ్ ట్యాంక్ ద్వారా వ్యర్థాలను నేరుగా మూసీలోకి వదులుతున్నారు. గత నాలుగేళ్లుగా ఐజీడీ (సీవరేజ్) ట్యాంక్‌లో మిషన్లు పనిచేయక పట్టణంలోని డ్రైనేజీ నేరుగా ఫిల్టర్ కాకుండానే మూసీలో కలుస్తోంది.

సంజీవరావు హయాంలో

రూ.20 కోట్ల నిధుల మంజూరు

దివంగత సంజీవరావు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మునిసిపల్ చైర్మన్ సత్యనారాయణ పాలకవర్గానికి రూ.20 కోట్ల నిధులు మంజూరయ్యాయి. వాటితో శివారెడ్డిపేట, కొత్తగడి, అనంతగిరి, బుగ్గ రోడ్ల వెడల్పుతో పాటు వీధి దీపాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా రూ.5కోట్లను పార్కు ఏర్పాటు కోసం కేటాయించారు. ఆ నిధులతోనే పట్టణంలో కొంతమేర రోడ్లు బాగు చేశారు. అయితే, పార్కును ఏర్పాటు పనులు ముందుకు సాగలేదు. శివసాగర్ సమీపంలో ఏర్పాటు చేయాలని ముందుగా నిర్ణయించుకున్నారు. అది కార్యరూపం దాల్చలేదు. పట్టణానికి దూరంగా ఉన్న ప్రదేశంలో పార్కు ఎందుకని అలాగే వదిలేశారు. ఆ డబ్బులను సైతం ప్రస్తుత పాలకవర్గం దారి మళ్లించి సాధారణ నిధుల్లో చేర్చి ఖర్చు చేశారు.

అధ్వానంగా విలీన గ్రామాల పరిస్థితి

వికారాబాద్ మునిసిపాలిటీలో కొత్తగా కలిసిన ఆరు గ్రామాల పరిస్థితి అధ్వానంగా మారింది. మద్గుల్ చిట్టంపల్లి, గుడుపల్లి, బూర్గుపల్లి, గిరిగేట్‌పల్లి, ధన్నారం, కొంపల్లి గ్రామాల్లో కొంతమేర అభివృద్ధి కూడా జరుగలేదు. ఆయా గ్రామాల ప్రజలు గతంలో ఉపాధి హామీ పనులు ద్వారానైనా కొంత డబ్బు పోగుచేసుకునేవారు. మున్సిపాలిటీలో కలపడంతో ఆ పనులు లేకపోగా సమయానికి ఇంటి ట్యాక్సులు చెల్లించడం తప్ప.. గ్రామంలో ఉపాధి అవకాశాలు లేకపోవడం అభివృద్ధి సైతం కుంటుపడింది. దాంతో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు.

చైర్‌పర్సన్ పదవీ కాలంపై పంచాయితీ!

బీఆర్‌ఎస్ హయాంలో అప్పటి ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ మున్సిపల్ చైర్మన్ విషయంలో రెండున్నరేళ్ల ఒప్పందం చేయడం.. ఆ తరువాత కరోనా మహమ్మారి వ్యాప్తి చెందడంతో అభివృద్ధికి ఆస్కారం లేకుండా పోయింది. దాంతో చైర్‌పర్సన్ మంజులా రమేష్ ఇతరులకు పదవి ఇవ్వడంపై నొచ్చుకున్నారు. మిగతా రెండున్నరేళ్లు తామే చైర్‌పర్సన్‌గా ఉంటామని భీష్మించడంతో అప్పట్లో బడా నేతల సమక్షంలో పంచాయితీ నడిచింది. ఈక్రమంలో చివరకు చైర్‌పర్సన్ మంజులా రమేష్ తన పంతం నెగ్గించుకుంది. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరారు.

కరోనా కాలంలో తోడుగా..

తన ఐదేళ్ల పాలనలో చైర్‌పర్సన్ మంజులా రమేష్ ప్రజల్లో ఉండడానికే ఎక్కువగా ఇష్టపడ్డారు. దాంతో మున్సిపాలిటీలో తనదైన ముద్ర వేసుకున్నారు. ముఖ్యంగా కరోనా సమయంలో రెడ్‌జోన్ వంటి ప్రాంతాలకు వెళ్లి ఆమె ప్రజలకు సేవలందించారు. వారికి అవసరమైన నిత్యావసరాలు సమకూర్చారు. వైద్యసేవలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

త్వరలో మున్సిపాలిటీకి నిధులు



స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చొరవతో మున్సిపాలిటీకి త్వరలో నిధులు రానున్నాయి. ఇన్నాళ్లు మున్సిపాలిటీని అభివృద్ధి చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేశాం. కరోనా సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పని చేశాం. పాలకవర్గం పూర్తి స్థాయిలో సహకరించింది. **- మంజులా రమేష్, చైర్‌పర్సన్, వికారాబాద్ మున్సిపాలిటీ**

అన్నోజిగూడలో ముగ్గుల పోటీలు



పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడలో ముగ్గులను పరిశీలిస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి, కౌన్సిలర్లు

ఘట్‌కేసర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడలో పోచారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శనివారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా మహిళలను పోత్సహించేందుకు ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్లు గుర్తుచేశారు. అనంతరం విజేతలకు నగదు బహుమతులతోపాటు పోటీల్లో పాల్గొన్న 102మంది మహిళలకు కన్సొలేషన్ బహుమతులు, జూట్ బ్యాగులను పంపిణీ చేశారు. అదేవిధంగా శ్రీనిధి ఇంజనీరింగ్ కళాశాలలో, సంస్కృతి టౌన్‌షిప్‌లో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో కౌన్సిలర్లు, నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

శనీశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



శనీశ్వరస్వామి దర్శనానికి తరలి వచ్చిన భక్తులు

మోమిన్‌పేట్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్కతలలో వెలిసిన శనీశ్వరుడి ఆలయంలో శనివారం శని త్రయోదశి పురస్కరించుకొని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి భక్తులు తైలాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహితులు దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో నరేందర్ ఏర్పాట్లు చేశారు.

'రియల్' మోసానికి అమాయకులు బలి



మాట్లాడుతున్న వెంకటేష్

మేడ్చల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఏకశిల నగర్ వెంచర్‌లో అమాయక ప్రజలను రియల్టర్లు, బ్రోకర్లు మోసం చేస్తున్నారని శ్రీహర్ష కన్‌స్ట్రక్షన్ యజమాని ఆలూరి వెంకటేష్ ఆరోపించారు. ఆయన శనివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కొంతమంది పనిగట్టుకుని ఏకశిలనగర్‌పై తప్పుడు ప్రచారం చేస్తూ అమాయక ప్రజలను మోసం చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారని తెలిపారు. 1985లో ఘట్‌కేసర్ మండలం, కొర్రెముల రెవెన్యూ పరిధి సర్వేనెంబర్లు 739. 740, 741, 742, 743, 744, 745, 746, 747, 748, 749ల్లోని 149ఎకరాల్లో చేసిన ఏకశిలనగర్ వెంచర్ 2006లో అధికారికంగా రద్దయిందన్నారు. అనంతరం 2007లో సర్వేనెంబర్లు 739, 740, 741, 742 లోని 47 ఎకరాల 25గుంటల భూమిని ఆలూరి వెంకటేష్, ఆలూరి విజయభాస్కర్‌లకు చెందిన శ్రీ హర్ష కన్‌స్ట్రక్షన్స్ పేరుపై కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇట్టి భూమిని నాటి తహసీల్దారు మ్యుటేషన్ సైతం చేసినట్లు గుర్తుచేశారు. 40 ఎకరాల 25గుంటల భూమిని రెసిడెన్షియల్ జోన్‌గా కన్వర్షన్ చేసినట్లు తెలిపారు. మిగతా ఏడెకరాల భూమికి తెలంగాణ ప్రభుత్వం జారీచేసిన పట్టాదారు పాసుపుస్తకాలు పొందినట్లు వెల్లడించారు. అయినప్పటికీ కొందరు రియల్ బ్రోకర్లు, వ్యాపారులు సర్వేనెంబర్లు 743, 744, 745, 747లకు సంబంధించిన ప్లాట్లు కొనుగోలు చేసి సర్వేనెంబర్లు 739, 742లలో ఉన్న భూమిని కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. సర్వేనెంబర్లు 739 నుంచి 749లో చేసిన లేఅవుట్ అక్రమలేఅవుట్ అని హైకోర్టు సూచన మేరకు నాటి డీపీవో రద్దు చేసినట్లు తెలిపారు. ఈ అక్రమ లేఅవుట్‌లో ఎలాంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వొద్దని హెచ్ఎండీఏ కమిషనర్, పంచాయతీరాజ్ ముఖ్యకార్యదర్శిలకు హైకోర్టు ఆదేశించినట్లు తెలిపారు. రియల్ వ్యాపారులు, బ్రోకర్లు సర్వేనెంబర్లు 743 నుంచి 747లలో అమాయక ప్రజలను మోసం చేస్తూ నమ్మించి ప్లాట్ల క్రయవిక్రయాలు చేసి లాభాలు పొందుతున్నారని, అదేవిధంగా తమ భూమిని కబ్జా చేయడానికి యత్నిస్తున్నారని ఆరోపించారు. వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. తమ భూమిని సర్వేచేయాలని కోర్టు ఆదేశాలున్నప్పటికీ తహసీల్దార్ మాత్రం కోర్టు ఆదేశాలను బేఖాతరు చేసిందన్నారు. అమాయక ప్రజలు రియల్ బ్రోకర్ల మాటలు నమ్మి మోసపొవద్దని ఆయన హితవు పలికారు.

టీపీసీసీ చీఫ్‌ను కలిసిన నేతలు



పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌తో సుధాకర్‌రెడ్డి

వికారాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను వికారాబాద్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్థ సుధాకర్‌రెడ్డి శనివారం ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా పీసీసీ చీఫ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి ప్రాధాన్యం కల్పిస్తామని భరోసా ఇచ్చారని, త్వరలో వికారాబాద్‌లో పర్యటిస్తానని పీసీసీ అధ్యక్షుడు తెలిపారని సుధాకర్‌రెడ్డి చెప్పారు.



మహేష్‌కుమార్‌గౌడ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వెంకటేష్ గౌడ్

ఘట్‌కేసర్: టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను జిల్లా యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు బాలగోని వెంకటేష్ గౌడ్ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పార్టీలో సీనియర్ నాయకులను గుర్తించి ఆయా కమిటీల్లో అవకాశాలు కల్పించాలని కోరినట్లు తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలో గీతాకార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టేందుకు కృషిచేయాలని కోరినట్లు తెలిపారు. పార్టీకోసం పని చేసిన వారికి ఎల్లప్పుడు సముచిత స్థానం ఉండేలా పార్టీ పనిచేస్తుందని చెప్పినట్లు వెంకటేష్ గౌడ్ తెలిపారు. ఆయనవెంట శ్రీకాంత్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

కొడంగల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఏబీవీపీ కొడంగల్ శాఖ ఆధ్వర్యంలో స్వామివివేకానంద జయంతి ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వివేకానందుడి జీవిత చరిత్ర గురించి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో 72మంది విద్యార్థులు పాల్గొన్నారు. అందులో నవీన ఆదర్శ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి సాయిశ్రీ మొదటి బహుమతి అందుకున్నాడు. విద్యార్థికి ఏబీవీపీ శాఖ సభ్యులు జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల వ్యవస్థాపకుడు డి.వెంకటయ్య, ప్రిన్సిపాల్ డీవీ.నరేశ్‌రాజ్, వైస్‌ప్రిన్సిపాల్ సంతోష, ఉపాధ్యాయులు శకుంతల, నాగేంద్రమ్మ, మేరాజ్, సునీత, సంగీత, అరుణ జ్యోతి, అరుణ, ఫాతిమా, ప్రభాకర్, అతీఖ్ అభినందించారు.



వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినికి జ్ఞాపికను అందజేస్తున్న ఏబీవీపీ శాఖ సభ్యులు

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

కులకచర్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): బైక్ ఢీకొని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మహిళ మృతిచెందింది. ఈ ఘటన కులకచర్ల మండలంలోని పుట్టపహాడ్‌లో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గొల్ల వెంకటయ్య పెద్ద భార్య బందెమ్మ(55) శుక్రవారం సాయంత్రం పొలం నుంచి ఇంటికి అనంతసాగర్, పుట్టపహడ్ దారిలో నడుచుకుంటూ వెళ్తోంది. ఈ క్రమంలో అనంతసాగర్ గ్రామానికి చెందిన వడ్డె నవీన్ బైక్‌పై అతివేగంగా వచ్చి బందెమ్మను ఢీకొట్టాడు. దీంతో ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆమెను పాలమూర్ ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ శనివారం మృతిచెందింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జైపాల్‌రెడ్డి తెలిపారు.

బస్సు ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

బొంరాస్‌పేట్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): బస్సు ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన బొంరాస్‌పేట్ మండలంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు బొంరాస్‌పేట్‌కు చెందిన పెద్దకటికె సలీం(20) తుంకిమెట్ల గ్రామంలోని పాత ఇనుప సామాను కొనుగోలు దుకాణంలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో రోజూమాదిరిగా పని ముగించుకొని శనివారం రాత్రి తిరిగి నడుచుకుంటూ ఇంటికి వస్తుండగా తుంకిమెట్ల సమీపంలోని కాకరవాణి వాగుపై గల వంతెనపై హైదరాబాద్ నుంచి కర్ణాటకకు వెళ్తున్న బస్సు ఢీకొంది. ఈ ఘటనలో సలీం కాలు విరిగింది. గమనించిన స్థానికులు వెంటనే కొడంగల్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి రెఫర్ చేశారు. యువకుడు సలీంను ఢీకొట్టిన బస్సు ఆపకుండా వెళ్లిపోవడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సలీం నిరుపేద కుటుంబానికి చెందిన వారు కావడంతో రోజు కష్టపడితే కాని పూట గడవని స్థితి. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని పలువురు డిమాండ్ చేశారు.

32 ప్యాకెట్ల చైనా మాంజా స్వాధీనం



పోలీసుల అదుపులో నిందితుడు

తాండూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీస్ అధికారులు శనివారం తాండూరు పట్టణంలోని గాలిపటాలు అమ్మే దుకాణాలపై దాడులు నిర్వహించారు. షాపు యజమాని సచిన్ నుంచి రూ.6400విలువ చేసే 32ప్యాకెట్ల చైనా మాంజానుస్వాధీనం చేసుకొని సచిన్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఈ దాడులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎవరైన ప్రభుత్వ నిషేదిత చైనా మాంజాను వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిందితుడు సచిన్‌ను తాండూరు టౌన్ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

గంజాయి సేవిస్తున్న ముగ్గురిపై కేసు



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

తాండూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎక్సైజ్ ఈఎస్ విజయ భాస్కర్, ఏఈఎస్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం తాండూరు ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో బాలగంగాధర్ శనివారం తాండూరు రైల్వే స్టేషన్, పార్కింగ్ పరిసరా ప్రాంతాలలో గంజాయి సేవిస్తున్న వారికి, విక్రయాలు చేసే వారికి వారి పేరెంట్స్‌కు కౌన్సెలింగ్ నిర్వహించారు. పార్కింగ్ పరిసరా ప్రాంతాల్లో సోదాలు నిర్వహించగా అనుమానాస్పదంగా కనిపిస్తున్న వారి జేబులు తనిఖీ చేయగా వారి వద్ద కవర్లలో సుమారు 100గ్రాముల గంజాయి లభించింది. గంజాయి లభించిన యుగేందర్, కార్తీక్, ఎండీ సమీర్ అదుపులో తీసుకొని వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్‌ఐలు రవికుమార్, నిజాముద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

పరిగి బస్టాండ్‌లో చైన్‌స్నాచింగ్

పరిగి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పరిగి ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం రాత్రి చైన్ స్నాచింగ్ జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. కులకచర్ల మండలం సాల్వీడ్ గ్రామానికి చెందిన అనిత హైదరాబాద్‌లో టెట్ పరీక్ష రాసింది. తిరుగుప్రయాణంలో శనివారం రాత్రి 8గంటల సమయంలో స్వగ్రామం వెళ్లేందుకు పరిగి ఆర్టీసీ బస్టాండ్‌లో మహబూబ్‌నగర్ బస్సు ఎక్కుతుండగా గుర్తుతెలియని దుండగులు ఆమె మెడలో ఉన్న బంగారు చైన్‌ను అపహరించుకెళ్లారు. చైన్ రెండు తులాలు ఉంటుందని బాధిత మహిళ తెలిపింది. అయితే పోలీసులకు సమాచారం ఇవ్వగా బస్సులో తనిఖీలు నిర్వహించగా ఆచూకీ లభించలేదు. పరిగి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పరిగి ఆర్టీసీ బస్టాండ్‌లో వరుసగా చోరీలు జరుగుతున్నాయి. ఈనెల ఏడున చైన్, 10న నగదు దొంగతనం జరిగింది. దీంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు.

బహిరంగంగా మద్యం సేవిస్తున్న వారిపై కేసులు

బంట్వారం జనవరి 11 (ఆంధ్రజ్యోతి): బహిరంగంగా మద్యం సేవిస్తున్న వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు శనివారం బంట్వారం ఎస్‌ఐ శ్రీశైలం యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం కేంద్రంలోని రక్తమైసమ్మ ఆలయం వద్ద బహిరంగంగా మద్యం సేవించి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నరని పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని అక్కడే మద్యం సేవిస్తున్న 10 మందిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మండలంలో ఎక్కడైనా బహింరంగా ఎవరైనా మద్యం సేవిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం



కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎస్‌ఐ, నాయకులు

దుద్యాల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం, శారీరక ధారుఢ్యం ఏర్పడుతుందని దుద్యాల ఎస్‌ఐ భరత్‌రెడ్డి అన్నారు మండలంలోని హస్నాబాద్‌లో శనివారం సంక్రాంతి పండగను పురస్కరించుకొని రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్‌తో కలిసి ఎస్‌ఐ ప్రారంభించారు. కబడ్డీ పోటీల్లో వివిధ జిల్లాల నుంచి 40కిపైగా జట్లు పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు. గెలుపొందిన మొదటి విజేతలకు రూ.30వేలు, రెండో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.20వేలు, మూడో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.5వేలు అందించనున్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రతినిధి ఎండీ.యూసుఫ్, ట్రెయినీ ఎస్‌ఐ రాహుల్ పాల్గొన్నారు.